ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 2 సెప్టెంబరు 2024





దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



ఇంటికన్నె సమీపంలో ట్రాక్ కొట్టుకుపోయి వేలాడుతున్న రైలు పట్టాలు

జల ప్రళయం

ఉమ్మడి వరంగల్ జిల్లాను ముంచెత్తిన వర్షం

- అతలాకుతలమైన జనజీవనం
- పొంగిపొర్లిన వాగులు, నీట మునిగిన పొలాలు
- పలు చోట్ల ప్రాణ, ఆస్తినష్టం
- వివిధ ప్రాంతాల్లో ఆరుగురి మృతి
- తాళ్లపూసలపల్లి వద్ద దెబ్బతిన్న రైల్వే ట్రాక్
- రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నెక్కొండ మండలంలో వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- లారీ సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు..
- నీటమునిగిన వరంగల్ నగరం
- పునరావాసకేంద్రాలకు వరద బాధితులు

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షాలు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలవల్ల ప్రాణ, నష్టం, ఆస్థి నష్టం సంభవించింది. పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో తండ్రీ కూతుళ్లున్నారు. ఒక యువకుడు వాగులో కొట్టుకుపోతుంటే రెవెన్యూ సిబ్బంది కాపాడారు. ఇళ్లు కూలి ఇద్దరు గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లాలో భారీవర్షాల వల్ల నలుగురు మృత్యువాత పడ్డారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి వద్ద వెంగమాంబ చెరువు మత్తడి వరదలో మునిగి జెరిపోతుల మల్లికార్జున్ (35) మృతి చెందాడు. వరద ఉధృతికి రైల్వే ట్రాక్‌లు కొట్టుకుపోయి పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం-వరంగల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కల్వర్టులు, రహదారులపై వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాలోని కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా సరాసరి 29.67 సెం.మీ, హనుమకొండ జిల్లాలో 6.95 సెం.మీ, వరంగల్ జిల్లాలో 15.10 సెం.మీ, ములుగు జిల్లాలో 11.3 సెం.మీ, జనగామ జిల్లాలో 5.7 సెం.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2.7 సెం.మీ వర్షపాతం రికార్డయింది.

- ములుగు జిల్లాతాడ్వాయి మండలం కాల్వపల్లి వద్ద వెంగమాంబ చెరువు మత్తడి వరదలో మునిగి జెరిపోతుల మల్లికార్జున్(35) మృతిచెందాడు. తాడ్వాయి-పస్రా మధ్యలో మొండెలతోగు, జలగలంచ వద్ద వరద నీరు 163 జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో శనివారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం మండలంలో జంపన్నవాగు ఒడ్డున ఉన్న బూటారం గ్రామానికి ముంపు ప్రమాదం ఉండటంతో అధికారులు 230మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. జంపన్నవాగు, దయ్యాలవాగు, గోదావరి ముంపు ప్రమాదమున్న గ్రామాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను తెరవాలని, ప్రజలను వెంటనే తరలించాలని ఆదేశించారు. ములుగు జిల్లా ములుగు మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య బొగ్గులవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జగ్గన్నగూడెం, సర్వాపురం గ్రామాలు రాకపోకలు నిలిచి పోయాయి. ఏటూరునాగారం మండలంలో పిడుగుపాటుకు పలు ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. దొడ్ల-ఎలిశెట్టిపల్లి సమీపంలో జంపన్న వాగు, మంగపేట మండలంలో మంగపేట-బోరునర్సాపురం గ్రామాల మధ్య గౌరారం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద నీరు బోరున ర్సాపురంను ముంచెత్తే ప్రమాదం ఉండడంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడ్వాయి మం డలంలో మేడారం జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు మత్తీ

మిగతా 7వ పేజీలో..



మహబూబాబాద్-అనంతారం రోడ్డులో ట్రాక్ పక్కన నిలిచిన నీరు



రఘునాథపల్లిలో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటితో నిలిచిపోయిన వాహనాలు

రైళ్ల రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ ధ్వంసం
- ఎక్కడివి అక్కడే నిలిచిపోయిన రైళ్లు
- కొన్ని రైళ్లు దారి మళ్లింపు..



విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి..

- అంతరాయం ఉన్న చోట ప్రత్యామ్నాయ పద్ధతిలో సరఫరా చేయాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



12 గంటలూ.. వరదలోనే..

- వరంగల్ జిల్లా నెక్కొండలో వరదలో చిక్కుకున్న బస్సు
- బిక్కుబిక్కుమంటూ గడిపిన 46మంది ప్రయాణికులు
- లారీ సాయంతో ఒడ్డుకు.. పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే



లారీలో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం..

వరదకు బలైన తండ్రీ కూతుళ్లు

- విమానాశ్రయానికి కారులో బయలుదేరగా ప్రమాదం
- మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరువాగులో ప్రమాదం





మోతీలాల్, అశ్విని(ఫైల్)

వివరాలు : 7లో..



మత్తడి పోస్తున్న ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ చెరువు



మత్తడి పోస్తున్న ఖానాపూరం మండలంలోని పాకాల చెరువు



జలగలంచ వద్ద కోతకు గురైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ



లక్నవరం ఉయ్యాల వంతెనను తాకుతున్న జలాలు



మహాముత్తారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కోనంపేట వాగు



కాటారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లారం అలుగువాగు

తాడ్వాయి అడవిలో సుడిగాలులు

- విరిగిపడ్డ వందల చెట్లు
- కొండపర్తిలో కొట్టుకుపోయిన ఇండ్ల పైకప్పులు

ములుగు, సెప్టెంబరు 1: భారీ వర్షానికి ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం అతలా కుతలమైంది. అటవీ ప్రాంతంలో సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. తాడ్వాయి-మేడారం మధ్య ఒకేచోట 200కుపైగా చెట్లు నేలకొరిగాయి. శనివారం రాత్రి కుండపోత వానకు సుడిగాలులు తోడవ్వడంతో చెట్లు వేర్లు సహా కూలిపడ్డాయి. అప్పటికే తాడ్వాయి-పస్రా మధ్య జలగలంచ, మొండెలతోగు వద్ద 163 జాతీయ రహదారిపై వరద ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

మేడారం వైపు చెట్లు పడటంతో 18 గంటల పాటు రవాణా స్తంభించింది. పోలీసులు చెట్లనన్నింటినీ యంత్రాల సాయంతో తొలగించారు. తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామంలో మూడిళ్ల పైకప్పులు సుడిగాలి దాటికి కొట్టుకుపోయాయి. రాష్ట్ర మంత్రి సీతక్క ఈప్రాంతాల్లో పర్యటించారు. ఈ తరహా గాలుల బీభత్సాన్ని మునుపెన్నడూ చూడలేదన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

మండలానికో ఫ్లడ్ మానిటరింగ్ టీమ్

- జాతీయ రహదారి అభివృద్ధికి రూ.400 కోట్లు
- హైలెవల్ వంతెనల నిర్మాణం
- ప్రజలు స్వీయ రక్షణ పాటించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ములుగు జిల్లా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

ములుగు, సెప్టెంబరు 1: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ములుగు జిల్లాలోని ప్రతి మండలానికీ ఐదుగురు అధికారులతో ఫ్లడ్ మానిటరింగ్ టీమ్‌ను నియమించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లోని వరద ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. గుండ్లవాగు, దయ్యాలవాగు, జంపన్నవాగు ప్రవాహాలు, జాతీయ రహదారి దెబ్బతిన్న జలగలంచ, మొండెల తోగు, కొండపర్తి గ్రామాలను కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎంహెచ్‌వో అప్పయ్యతోపాటు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్, అధికారులు, ఎస్పీ, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి పనిచేస్తున్నారని తెలిపారు. 2022, 2023లో జిల్లాను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా నష్టం కూడా వాటిల్లిందన్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈసారి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని తెలిపారు. రెండు నెలల ముందు నుంచే వరుస సమీక్షలు జరుపుతూ అధికారులు కార్యోణ్ముఖులను చేశామన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఇతర అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ రహదారి అభివృద్ధి కోసం మంజూరైన రూ.400 కోట్ల నిధులతో జలగలంచ, మొండెలతోగు వద్ద హైలెవల్ వంతెనలను నిర్మిస్తామని చెప్పారు. జిల్లాకు భారీ వర్షసూచన ఉందని, ప్రజలు స్వీయరక్షణ పాటించాలని సూచించారు. శిథిలమైన పాత ఇళ్లలో ఉండొద్దని అన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. తాడ్వాయి మండలంలో పిడుగుపాటుకు ఒకరు, వరదలో మునిగి మరొకరు మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. వాగులు, వరదలను దాటకుండా పోలీసు సిబ్బంది చేత బారికేట్లను ఏర్పాటుచేసి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరద సహాయక చర్యలలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ప్రజాసంఘాలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని, బాధితులకు ఆపన్నహస్తం అందించాలని కోరారు. సీతక్క వెంట ములుగు డీఎస్పీ రవీందర్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్, నీటి పారుదల శాఖ, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.



తాడ్వాయి కొండపర్తి గ్రామస్థులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



ములుగు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నాయకులు

పెన్షన్ విధానంపై కన్నెర్ర

- ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 1: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ (టీజీఈ జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ములుగులోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా టీజీఈ జేఏసీ చైర్మన్ పోలు రాజు, వివిధ సంఘాల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ అమలులోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసి ఉద్యోగులకు భరోసా ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయ పెన్షనర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నాయకులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్, అన్నవరం రవికాం త్, కాసర్ల రమేష్, వేం యాకూబ్‌రెడ్డి, మహ్మద్ సర్వర్, రవీందర్, హట్కర్ సమ్మయ్య, నాగరాజు, వాసుదేవరెడ్డి, ఏఎస్‌రావు, సునీల్, కుమార్, సారయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ర్యాలీ

భూపాలపల్లిటౌన్ : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీజీ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. జయశంకర్ విగ్రహం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సంద్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ రవి మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ధశరథరామారావు, కిరణ్‌కుమార్, సునిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లిలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విద్రోహ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయకుంటే దశల వారీ నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, అనిల్, శరత్, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 1: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న భూపాలపల్లిలో నిర్వహించనున్న ఎంపిక పోటీలను వాయిదా వేసినట్టు ప్రధాన కార్యదర్శి సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పోటీలను ఈనెల 13కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియా చివరి స్థానం

- ఐదు నెలల్లో సాధించింది 69 శాతమే..

కాకతీయఖని, సెప్టెంబరు 1: బొగ్గు ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియా చివరి స్థానంలో ఉంది. గడిచిన ఐదు నెలల్లో 69 శాతమే ఉత్పత్తిని సాధించింది. 2024-25 వార్షిక సంవత్సరానికి 49.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని యాజమాన్యం నిర్దేశించింది. ఈ క్రమంలో అధికారులు టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అయితే.. ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఏ ఒక్క నెలలోనూ వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిన దాఖలాలు లేవు. గడిచిన ఐదు నెలల్లో కేవలం 69 శాతం ఉత్పత్తిని మాత్రమే సాధించారు. ఏరియాలో భూసేకరణ సమస్యలు, కార్మికుల గైర్హాజరు అంశాలే ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు.

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో సుమారు ఐదు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో యువ కార్మికుల సంఖ్య అధికంగానే ఉంది. అయితే.. అధిక బొగ్గు ఉత్పత్తి సాధించగల సత్తా ఉన్న యువ కార్మికులకు యాక్టింగ్ సర్ఫేస్ పనులు అప్పగిస్తూ, వయసు మళ్లి, వివిధ వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ కార్మికులను అధికారులు అండర్ గ్రౌండ్‌లోకి దింపి పనిచేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏరియా అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని సాధించలేకపోతోందని పలు కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. గనుల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోందని విమర్శిస్తున్నారు. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్ గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి ద్వారా 2024-25 సంవత్సరంలో 49.60 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీయాల్సి ఉంది. అయితే గడిచిన ఐదు నెలల్లో (ఏప్రిల్ నుంచి ఆగస్టు) వరకు సుమారు 10.64 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు సింగరేణి లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన ఏడు నెలల్లో 38.96 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి వెలికి తీయడం సాధ్యపడేనా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏరియాలోని కొందరు అధికారులు బొగ్గు ఉత్పత్తిపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

బొగ్గు ఉత్పత్తి (ఏప్రిల్-ఆగస్టు-టన్నుల్లో)

గని	లక్ష్యం	సాధించింది	శాతం
కేటీకే-1	1,04,000	71,682	70 శాతం
కేటీకే-5	1,06,100	83,081	79 శాతం
కేటీకే-6	76,400	50,515	67 శాతం
కేటీకే-8	1,17,500	72,898	63 శాతం
ఓసీ-2	3,80,000	4,14,573	109 శాతం
ఓసీ-3	7,61,000	3,68,128	48 శాతం

అట్టడుగు స్థానంలో..

బొగ్గు ఉత్పత్తిలో భూపాలపల్లి ఏరియా చివరి స్థానంలో కొనసాగుతోంది. మిగతా ఏరియాల కంటే భూపాలపల్లి ఏరియా అట్టడుగు స్థానంలో ఉంది. ఆర్జీ-2 ఏరియా 126శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి మొదటి స్థానంలో ఉంది. ఇల్లందు 116 శాతంతో రెండో స్థానం, 96 శాతంతో ఆర్జీ-3 మూడో స్థానం, ఏపీఏ(ఏఎల్‌పీ) 95 శాతం, కొత్తగూడెం 94శాతం, మణుగూరు 93 శాతం, బెల్లంపల్లి ఏరియా 92 శాతం, 87శాతం ఆర్జీ-1, మందమర్రి 80శాతం, శ్రీరాంపూర్ ఏరియా 73 శాతంతో నాలుగు నుంచి పది స్థానాల్లో ఉన్నాయి. 69 శాతం సాధించి భూపాలపల్లి ఏరియా చివరి స్థానంలో ఉంది.

కాళోజీ అవార్డు కమిటీ చైర్మన్‌గా అందెశ్రీ

ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 1 : యేటా సెప్టెంబరు 9న ప్రకటించే కాళోజీ స్మారక అవార్డు కోసం ఎంపిక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రజా గాయకుడు అందెశ్రీ చైర్మన్‌గా కమిటీని నియామకం చేసింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు కన్వీనర్‌గా ప్రభుత్వ అధికారి, కవి ఏనుగు నర్సింహారెడ్డి, సంగిశెట్టి నర్సయ్య, కాళోజీ ఫౌండేషన్ పక్షాన పొట్లపల్లి శ్రీనివాసరావు సభ్యులుగా కమిటీని నియామకం చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఈసారి వరంగల్‌లో ప్రదానం చేయనున్న కాళోజీ స్మారక అవార్డుకు అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయనున్నారు.

ఈనెల 21 నుంచి
ఎలక్ట్రిసిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్స్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 1 : టీజీ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్స్ ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు కరీంనగర్ సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. టోర్నమెంట్స్‌లో పాల్గొనాలనుకునే ఉమ్మడి వరంగల్‌లోని ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 5న హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సెలెక్షన్స్ హాజరు కావాలన్నారు.

బ్రీత్ ఎనలైజర్‌ను నిషేధించాలని ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

వరంగల్-2 డిపోలో అధికారులతో ఘర్షణ



వరంగల్-2 డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

బాలసముద్రం, సెప్టెంబరు 1 : వరంగల్-2 డిపోలో పనిచేయని బ్రీత్ ఎనలైజర్‌లను నిషేధించాలని ఆదివారం ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్‌లు ఆందోళన చేశారు. సెక్యూరిటీ అధికారులు డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో చెకింగ్ చేస్తూ ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టులు ఇచ్చి డ్రైవర్లపై చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ మేరకు డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. కాగా, ఆర్టీసీ డ్రైవర్ ఎన్.నరేందర్ వరంగల్-2 డిపోలో రాజధాని బస్సు సర్వీసు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్నాడు. అదివారం సెక్యూరిటీ సిబ్బంది నరేందర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 26 వచ్చిందన్నారు. మద్యం అలవాటు కూడా లేని తనకు 26 రావడంపై నరేందర్ స్థానిక డిపో ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ వై.శ్రీనివాస్, డిపో ప్రెసిడెంట్ రమేష్, మురళి ప్రచారకార్యదర్శికి సమాచారం అందించాడు. అక్కడికి చేరుకుని సెక్యూరిటీ అధికారులతో డ్రైవర్లు ఘర్షణకు దిగారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ టెస్టు చేసుకొమ్మని చెప్పడంతో డ్రైవర్ నరేందర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పోలీసులు చెక్ చేస్తే 0 వచ్చినట్లు తెలిపారు.

అలాగే శనివారం ఎండి.యాకూబ్ అనే డ్రైవర్ హనుమకొండ నుంచి మంగపేట ఎక్స్‌ప్రెస్ బస్సుడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సెక్యూరిటీ సిబ్బంది పరీక్షించగా 130 వచ్చిన్నట్లు తెలిపారు. యాకూబ్‌కు మద్యం సేవించే అలవాటు లేదని డిపో సెక్యూరిటీ అధికారులను డ్రైవర్లు నిలదీశారు. డిపోలో గతంలో ముగ్గురిని అకారణంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది తప్పిదం వల్ల టెస్టు చేసిన రిపోర్టును అధికారులకు పంపించి తరువాత డ్రైవర్లను సస్పెండ్, రిమూవ్ చేస్తున్నారు. దీంతో డ్రైవర్లు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తోందని ఆందోళన చేశారు. డిపోలో డ్రైవర్ల కొరతతో అదనపు డ్యూటీలు చేస్తూ నిద్ర లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

- అంతరాయం ఉన్నచోట ప్రత్యామ్నాయ పద్ధతిలో సరఫరా చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, ఇన్‌సెట్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ, ఎస్ఈ

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 1 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అంతరాయాలు ఉన్న చోట ఆయా జిల్లాల ఉన్నతాధికారుల సహాయం తీసుకొని వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న సందర్భంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితోపాటు 16 జిల్లాల ఎస్ఈలు, 40 మంది డీఈలతో భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉందని ఎస్ఈలు, డీఈలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విపత్తులో ముందుగా నష్టపోయేది విద్యుత్ శాఖ కాబట్టి.. విద్యుత్ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండి నష్టాలను ముందస్తుగానే అంచనా వేసి విద్యుత్ లేని చోట పునరుద్ధరించేందుకు కృషి చేయాలన్నారు. వరదల వల్ల నీటమునిగిన సబ్‌స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులు ఎప్పటికప్పుడు అమలు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలు ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ఎస్ఈలతో నిరంతరం సమీక్షలు జరపాలని సీఎండీ వరుణ్‌రెడ్డిని ఆదేశించారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలుంటే వాటి పరిష్కారానికి విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన 1912, 18004250028 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. సామాజిక బాధ్యతలను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రిని సైతం లెక్కచేయకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బందిని డిప్యూటీ సీఎం అభినందించారు.

శభాష్ నగేష్!

- కావడి కట్టి వృద్ధురాలికి రక్షణ
- 100 మందిని పునరావాసానికి తరలించిన సీరోలు ఎస్సై



వృద్ధురాలిని జోలెలో తరలిస్తున్న ఎస్సై నగేష్

సీరోలు, సెప్టెంబరు 1: మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. దీంతో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సేవలందించారు. మరిపెడ మండలం సీతారాంతండా నీట మునగడంతో అక్కడి గిరిజనులు ఎటూ కదలలేని స్థితిలో తల్లడిల్లుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు భరోసాగా నిలిచి 100 మంది తండావాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే తండాలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని రక్షించేందుకు పోలీసులు కావడి కట్టి, ఆమెను అందులో కూర్చోబెట్టి సురక్షిత ప్రాంతానికి చేర్చారు. సీరోలు ఎస్సై నగేష్ స్వయానా కావడి మోసి 60ఏళ్ల వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో తండావాసులతో పాటు అటు పోలీసు వర్గాలు, జిల్లా ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

రైళ్ల రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో రైల్వే ట్రాక్ ధ్వంసం
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన రైళ్లు
- బోసిపోయిన వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లు

గిర్మాజీపేట, సెప్టెంబరు 1: విజయవాడ - వరంగల్ రైల్వే మార్గంలోని ఇంటికన్నె - కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ, దిగువ రైల్వేట్రాక్‌లు ధ్వంసం, మహబూబాబాద్ - తాళ్లపూసపల్లి రైల్వే ట్రాక్‌పై వరద నీరు కారణంగా రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడ- వరంగల్-సికింద్రాబాద్, విజయవాడ-వరంగల్ - న్యూఢిల్లీ మార్గాల్లో రైళ్ల రాకపోకలు శనివారం రాత్రి నుంచి పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ మార్గంలో నడుస్తున్న రైళ్లను ఆయా స్టేషన్లలో నిలిపిశారు. శనివారం రాత్రి నుంచి మొదలైన భారీ వర్షం ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. భారీ వర్షంతో రైల్వేస్టేషన్, రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోగా సిబ్బంది తొలగించారు.

కాగా, సికింద్రాబాద్ నుంచి మచిలీపట్నం బయలుదేరిన మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అర్ధరాత్రి నుంచి వరంగల్‌లో నిలిచిపోయిన ఈ రైలును ఆదివారం ఉదయం 7.30 గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు పంపించారు. అలాగే శనివారం అర్ధరాత్రి నుంచి ఎలుగూరు రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన పాటలీపుత్ర - యశ్వంత్‌పూర్ రైలును ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరిగి సికింద్రాబాద్‌కు పంపించారు. శనివారం రాత్రి నుంచి చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌కు పంపించారు. చింతల్‌పల్లి, ఎలుగూరు, వరంగల్ రైల్వేస్టేషన్లలో నిలిచిపోయిన పాటలీపుత్ర - యశ్వంత్‌పూర్, సంబల్‌పూర్, మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్‌ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా వరంగల్ రైల్వేస్టేషన్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. రైల్వే రక్షిత బృందం(ఆర్‌పీఎఫ్) ప్రయాణికులకు భద్రత ఏర్పాట్లు చేసింది. వరంగల్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్ర ఆధ్వర్యంలో కమర్షియల్ సిబ్బంది ప్రయాణికులకు తగిన సహకారం అందించారు.

పలు రైళ్ల రద్దు



వరంగల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై వర్షపు నీటిని తొలగిస్తున్న సిబ్బంది

వరంగల్ మీదుగా సికింద్రాబాద్, - విజయవాడ మధ్య ప్రయాణించాల్సిన అన్ని రైళ్లను రద్దు చేశారు. గోల్కొండ, కృష్ణ, ఇంటర్‌సిటీ, శాతవాహన, గోదావరి, చార్మినార్ రైళ్లను రద్దు చేశారు. ఆదివారం వరంగల్ మీదుగా వెళ్లాల్సిన పద్మావతి, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్‌కు రాకుండా సికింద్రాబాద్ నుంచి కాచిగూడ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా విజయవాడ వైపు వెళ్లాల్సిన రైళ్లను వరంగల్ రాకుండా కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు తరలించారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు కారణంగా వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో శనివారం రాత్రి నుంచి హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయి. రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారాన్ని హెల్ప్‌డెస్క్ సిబ్బంది ప్రయాణికులకు చెబుతున్నారు. రైళ్ల రద్దుతో వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లు ఆదివారం వెలవెలబోయాయి. ఇదిలా ఉండగా, ఆదివారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో వచ్చారు. వరద నీరు కారణంగా ధ్వంసమైన ఇంటికన్నె - నెక్కొండ రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

రైళ్ల దారి మళ్లింపు

- వర్ష ప్రభావంతో అధికారుల చర్యలు
- ఇప్పగూడ వద్ద ట్రాక్‌పైకి చేరిన వరద నీరు



రైళ్ల రద్దుతో కాజీపేటలో బోసిపోయిన ప్లాట్‌ఫారం



ఇప్పగూడ రైల్వే ట్రాక్‌పై చేరిన వరద నీరు

కాజీపేట, సెప్టెంబరు 1: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేసముద్రం - ఇంటికన్నె వద్ద వరద ఉధృతికి రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో కాజీపేట మీదుగా విజయవాడ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపువెళ్లే పలు రైళ్లను నల్లగొండ మీదుగా రూట్‌మార్చి పంపారు. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. న్యూఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా వెళ్ల పలు రైళ్లను దారిమళ్లించి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు తరలించారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే కాజీపేట రైల్వేస్టేషన్ ప్రయాణికులు లేకపోవడంతో బోసిపోయింది. ప్రయాణికులకు రైళ్ల వివరాలు తెలిపేందుకు రైల్వే అధికారులు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రైళ్ల రద్దు వివరాలు తెలియకుండా రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు.

కాగా, స్టేషన్ ఘన్‌పూర్ సమీపంలోని ఇప్పగూడ వద్ద రైల్వే ట్రాక్‌పై భారీగా నీరు చేరింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. ఇదిలా ఉండగా రైల్వే ఎమర్జెన్సీ సేవలందించే బ్రేక్‌డౌన్ సిబ్బందికి లీవ్‌లు రద్దు చేశారు. రైళ్లకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రాకపోకలు ఇతరత్రా విషయాలను తెలుసుకునేందుకు కాజీపేట రైల్వే స్టేషన్‌లోని హెల్ప్‌లైన్ నంబర్ 0870- 2576430కు ఫోన్ చేయాలని రైల్వే అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత

వాజేడు, సెప్టెంబరు 1: తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు భారీగా చేరడంతో జలపాతం ఉప్పొంగుతోంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాల నేపథ్యంలో జలపాతం సందర్శనను ఫారెస్టు అధికారులు నిలిపివేశారు. ఆదివారం పలువురు పర్యాటకులు రాగా వారిని అనుమతించలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

కేయూ పరిధిలోని నేటి పరీక్షలన్నీ వాయిదా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 1: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెప్టెంబరు 2వ తేదీ సోమవారం రోజున జరగాల్సిన పరీక్షలన్నీ భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి ఆదివారం ప్రకటించారు. డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల థియరీ, ప్రాక్టికల్స్, వైవా, పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, సెప్టెంబరు 3వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతామని స్పష్టం చేశారు.

నేడు వర్సిటీతో పాటు వర్సిటీ కళాశాలలకు సెలవు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 1: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు వర్సిటీ సుబేదారి పీజీ కళాశాల, మహిళా పీజీ కళాశాల, ఖమ్మం అనుబంధ కళాశాలన్నింటికీ సెప్టెంబరు 2వ తేదీన సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కేయూ ఇన్‌చార్జ్ వీసీ, ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి వెల్లడించారు. సెప్టెంబరు 3 నుంచి యథావిధిగా వర్సిటీ, అనుబంధ కళాశాలన్ని పనిచేస్తాయని వెల్లడించారు.

వరంగల్‌లో బస్సు సర్వీసులు రద్దు

- బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

బాలసముద్రం, సెప్టెంబరు 1: వరంగల్ రీజియన్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చెరువులు, కుంటలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పలు రూట్లలో బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం వెళ్లే బస్సులను ములుగు జిల్లా పస్రా వరకు కొనసాగించారు. హనుమకొండనుంచి భద్రాచలం వెళ్లే బస్సు సర్వీసులను నర్సంపేట, గూడూరు వరకు కొనసాగించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట డిపోలకు చెందిన బస్సు సర్వీసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్టాండ్‌కు రాలేదని, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి వద్ద భారీ వర్షానికి వరంగల్ డిపోకు చెందిన బస్సులు వరదల్లో చిక్కుకున్నట్లు తెలిపారు. బస్సు సర్వీసులు లేకపోవడంతో వివిధ రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడినట్లు తెలిపారు.

వరద నీటిలో మునిగి ఒకరి మృతి



మేడారం, సెప్టెంబరు 1: వరదనీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల మల్లికార్జున్(38) పశువులను తోలేందుకు బయటకు వచ్చాడు. గ్రామంలోని ఆశ్రమ పాఠశాల వెనుక ఉన్న తోల్లతోగు వరద నీటి నుంచి దాటుతుండగా గల్లంతయ్యాడు. ఈత రాకపోవడం, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటిలో కొట్టుకుపోయాడు. దూరం నుంచి గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లి వరదలో గాలించగా మల్లికార్జున్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజికఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వరదకు బలైన తండ్రీ కూతుళ్లు

- విమానాశ్రయానికి కారులో బయలుదేరగా ప్రమాదం
- మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరువాగులో ఘటన





గల్లంతైన తండ్రి మోతీలాల్, కూతురు అశ్విని (ఫైల్), అశ్విని మృతదేహం

మహబూబాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం హైలెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న ఆకేరువాగు ఉధృతిలో కారు కొట్టుకుపోయింది. ఇందులో ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గేట్ తండాకు చెందిన తండ్రి, కూతురు నూనావత్ మోతీలాల్, నూనావత్ అశ్వినిలు గల్లంతయ్యారు. వాగు ఉధృతి తగ్గాక బాల్ని ధర్మారం శివారు పామాయిల్ తోటలో నూనావత్ అశ్విని మృతదేహం లభించింది.

నూనావత్ అశ్విని దేశ స్థాయిలోనే వ్యవసాయ శాస్త్రవేత్తగా ప్రథమస్థానం సాధించి సత్తా చాటారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ పూర్తిచేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికై ఏజీబీఎస్సీలో బంగారు పతకంతోపాటు మూడు రజిత పతకాలు, విశ్వవిద్యాలయం స్థాయిలో ఆరు బంగారు పతకాలు, డిల్లీలో అగ్రికల్చర్ ఎంఎస్సీలో బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం ఇక్రిశాట్‌లో మూడోసంవత్సరం పీహెచ్‌డీ పరిశోధకురాలుగా పనిచేస్తున్నారు. రెండ్రోజుల కిందట తన సోదరుడి నిశ్చితార్థానికి వచ్చి బెంగళూరు వెళ్లేందుకు ఆమె తండ్రి డ్రైవింగ్ చేస్తుండగా, ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ విమానాయశ్రయానికి బయలు దేరారు. సుమారు 4.30 గంటల ప్రాంతంలో పురుషోత్తమయగూడెం బ్రిడ్జి పైనుంచి ఆకేరు ప్రవహిస్తుండగా వాగు దాటే ప్రయత్నంలో కారుతో సహా కొట్టుకుపోయారు. తండ్రి మృతదేహం ఇంకా లభించలేదు.

మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

ఖానాపురం, సెప్టెంబరు 1: మూడు రోజులుగా వర్షాలు దంచికొట్టడంతో పాకాల సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దీంతో సరస్సు ఆదివారం మత్తడి ఉధృతితో పరవళ్లు తొక్కుతోంది. పాకాల సరస్సు పూర్తి సామర్థ్యం 30.3 అడుగులు కాగా, ప్రస్తుతం సరస్సులోకి 32.3 అడుగుల నీరు చేరడంతో రెండు అండుగుల మేర మత్తడితో పరవళ్లు తొక్కుతోంది.

కల్వర్టులో పడి వృద్ధురాలి మృతి



సమ్మక్క మృతదేహం

దుగ్గొండి, సెప్టెంబరు 1: నీటి కల్వర్టులో పడి 75 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో ఆదివారు చోటు చేసుకొంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని మందపల్లికి చెందిన కొంద్ర సమ్మక్క (75) ప్రతీరోజు గిర్నిబావితో పాటు సమీప గ్రామాల్లో భిక్షాటన చేస్తూ ఉంటుంది. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన సమ్మక్క సాయంత్రం ఇంటికి రాలేదు. కుమారుడు సదయ్య అమ్మకోసం వెతికినప్పటికీ దొరకలేదు. ఆదివారం గిర్నిబావి సమీపంలోని కల్వర్టులో సమ్మక్క మృతదేహం కనిపించగా గ్రామస్థులు చూసి స్థానిక పోలీసులకు తెలిపారు. ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కల్వర్టు నుంచి బయటకు తీశారు. సమ్మక్కకు సరిగా కళ్లు కనిపించకపోవడంతో రోడ్డు పక్కన ఉన్న నీటి కల్వర్టులో పడగా వర్షం నీటి ప్రవాహంతో కొంతదూరం కొట్టుకొనిపోయి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, ఎంపీడీవో లెక్కల అరుంధతి చేరుకొని సమ్మక్క మృతికి కారణాలను ఎస్సై ద్వారా తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి సమ్మక్క దహన సంస్కారాలకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసి ప్రభుత్వపరంగా సాయం అందే విధంగా చేస్తానని తెలిపారు. మృతి చెందిన సమ్మక్కకు కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతిరాలు కుమారుడు కొంద్ర సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జల ప్రళయం

(5వ పేజీ తరువాయి)

మత్తడి పోస్తోంది. వెంకటాపురం(నూగూరు) మండలంలో మొర్రవాని గూడెంలో మల్లమ్మకు చెందిన ఇల్లు కూలింది. గోపాల్‌పూర్‌లో ఒక ఇల్లు నేలమట్టమైంది.

- జయశంకర్ భూపాపల్లి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలవల్ల పలు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. గణపురం మండలంలో లోలెవల్ కాజ్‌వేలు పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం మండలంలో పత్తి పంట నీట మునిగింది. చిట్యాల, ఘనపురం మండలాల్లో చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి.

- వరంగల్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. పర్వతగిరి, నెక్కొండ మండలాల్లో అతిభారీ వర్షం పడింది. మిగతా మండలాల్లోనూ భారీ వర్షం పడడంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో 151.0మిమీ వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లోకి నీటి ఉధృతి పెరుగుతుండడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న పైపులైన్‌కు తోడు మరో కాలువను తవ్వారు. వర్ధన్నపేట నుంచి కోనాపురం వెళ్లే కల్వర్టు గతంలోనే గండిపడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనారెడ్డి చెరువుకు నీటిని తీసుకువచ్చే కట్టు కాలువ మరమ్మతులకు నోచుకోక పోవడంతో చెరువులోకి నీరువచ్చే మార్గం లేకనే పూర్తిస్థాయిలో నిండడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో ఊర చెరువుకు బుంగ పడడంతో అప్రమత్తమైన అధికారులు బుంగను పూడ్చారు. మండలకేంద్రంలో అతి పెద్ద చెరువైన కోపాకుల చెరువు పూర్తి నీటి మట్టానికి చెరుకొని మత్తడి పోస్తోంది. నర్సంపేట- నెక్కొండ ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట- చెన్నారావుపేటకు రాకపోకలు నిలిచిపోయాయి. పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో నడిరోడ్డుపై చెట్టుపడిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. నర్సంపేట మండలంలోని మాధన్నపేట చెరువు, మగ్దుంపురం ఊర చెరువు, మహేశ్వరం, ముత్తోజిపేట గ్రామాల్లోని చెరువులు నిండి మత్తడి పోస్తున్నాయి. మాధన్నపేట వాగు పొంగి పొర్లడంతో వాగు బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో నర్సంపేట నుంచి మాధన్నపేట వైపు రాకపోకలను అధికారులు నిలిపివేయించారు. గురిజాల లోలెవల్ వంతెనపై వరద పెరగడంతో నర్సంపేట నుంచి గురిజాల, గుంటూరుపల్లి, లింగాపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లబెల్లి మండలంలోని రంగాయ చెరువు మత్తడి పోసింది. దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట దామెర చెరువు మత్తడిపోయగా తిమ్మంపేటలోని వరి పంట పొలాలు నీటిలో మనిగిపోయాయి. తిమ్మంపేట, నారాయణతండా రోడ్డు మధ్య గల కాజ్వేపై వరదనీరు ఉధృతంగాప్రవహించగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి జిల్లాలోని చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి వేములవాడ నుంచి మహబూబాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాత్రి పది గంటల సమయంలో నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగు పారుతుండడంతో అందులో చిక్కుకుంది. ఆదివారం ఉదయం కలెక్టర్, నర్సంపేట ఎమ్మెల్యే హుటాహుటిన చేరుకుని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద కల్వర్టులో పడి మందపల్లికి చెందిన సమక్క (75) మృతి చెందింది. పాకాల సరస్సు రెండు అడుగుల మేర మత్తడిపోయడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కల్వర్ట్ బ్రిడ్జిపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో నర్సంపేట నుంచి పాకాల మీదుగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, పాకాల సరస్సు మత్తడి ఉధృతి పెరగడంతో పోలీసులు ముందుస్తు భద్రత చర్యలు చేపట్టారు.

- జనగామ జిల్లాను ఆదివారం జోరువాన ముంచెత్తింది. శనివారం రాత్రి నుంచి మొదలైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసింది. వర్షం కారణంగా జిల్లాలోన్ని అన్ని మండలాల్లోని చెరువులు, కుంటలన్నీ నిండిపోయాయి. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పలు రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో చాలాచోట్ల రోడ్లు తెగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల కారణంగా చెరువులు మత్తడి పడి వాగులు పారాయి. పాలకుర్తి మండలం నారాయణగూడెం-వావిలాల గ్రామాల మధ్య నల్లిగానికుంట తండాకు వెళ్లే రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. కొడకండ్ల మండలం రామవరం వద్ద రోడ్డు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా జిల్లాలోని చాలా చోట్ల రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దేవరుప్పుల మండలం రామచంద్రాపురం గ్రామ శివారు రామసముద్రం చెరువు మత్తడి పడడంతో కోలుకొండ- రామచంద్రాపురం గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. దేవరుప్పుల మండలం కడవెండి చెక్‌డ్యామ్ వద్ద వాగు ఉధృతిగా ప్రవహిస్తోంది. జనగామ- హుస్నాబాద్ రోడ్డులో జనగామ మండలం గానుగుపహాడ్ వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు వర్షం కారణంగా కొట్టుకుపోయింది. అదే విధంగా దేవరుప్పుల మండలం కోలుకొండ వద్ద, పెద్దమడూరు చెక్‌డ్యామ్ వద్ద వాగులు దుంకి పారుతున్నాయి. లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం వద్ద నిర్మాణంలో ఉన్న కాజ్‌వే వద్ద తాత్కాలిక రోడ్డు వరద నీటి కారణంగా కొట్టుకుపోయింది. దీంతో జనగామ-పాలకుర్తి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు పాలకుర్తికి వెళ్లే వాహనాలను చిన్నమడూరు, అప్పిరెడ్డిపల్లి మీదుగా పాలకుర్తికి మళ్లించారు. జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి), పాలకుర్తికి వెళ్లే దారిలో బీటీరోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. జనగామ మండలం చీటకోడూరు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


- మహబూబాబాద్ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షంతో ఆదివారం జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, చెరువులు పొంగిపొర్లడంతో పాటు మత్తళ్లు పోస్తున్నాయి. మానుకోట పట్టణంలో చుట్టూరా చెరువులు నిండి పొంగి ప్రవహించడంతో రోడ్లపైకి నీరురావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్నేరువాగు ఉధృతంగా ప్రవహించి, రోడ్డుపైకి నీరు రావడంతో మహబూబాబాద్- వరంగల్‌కు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. నర్సింహులపేట వద్ద కాడెద్దులు కొట్టుకుపోయాయి. వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మహబూబాబాద్ మండలం వీఎస్.లక్ష్మీపురంలో సుమారు రూ.16 లక్షల విలువైన కోళ్లఫాం నేలకూలింది. జిన్నెలవాగు ప్రవహిస్తుండడంతో మహబూబాబాద్-ఇల్లందు మధ్య, దంతాలపల్లిలో పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దంతాలపల్లి-సూర్యాపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కురవి పెద్దచెరువు అలుగుపడి రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. ముత్యాలమ్మ చెరువు అలుగుపడి మొగిలిచర్ల రోడ్డు కొంతమేర తెగిపోయింది. నర్సింహులపేట మండలంలో మూడు చెరువులు, ఆరు కుంటలకు గండి పడింది. పత్తి, వరి, ఇతర పంటలల్లో ఇసుకదిబ్బలు పేరుకుపోయాయి. పకీరాతండాలో ఆకేరువాగులో ఒక గేదె, ఆరు కాడెద్దులు వరదలో కొట్టుకుపోగా, అందులో గేదె మృతి చెందింది. నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి చెరువు తెగిపోవడంతో రావిరాల గ్రామం నీటమునిగింది. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి ఆకేరు వాగు కుడి కాలువ తెగిపోవడంతో వరిపొలాలు మొత్తం నీటమునిగాయి. ఉగ్గంపల్లికి చెందిన కొంపెల్లికి వెంకన్నకు చెందిన 12 గొర్రెలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో రాకాసితండా, సీరోలు మండలం దుబ్బతండాలోకి భారీగా వరద నీరు చేరి మునిగిపోతుండడంతో 300 మందిని గ్రామస్థులు తీసుకువచ్చి సీరోలు మండలం చిలుక్కోయలపాడులో ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయం కల్పించి భోజన వసతులు ఏర్పాటు చేశారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఆగిన పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో 11 నెలల బాబుకు అస్వస్థతకు గురికావడంతో 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు.

- హనుమకొండ జిల్లాను భారీవర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షం వల్ల జిల్లా అతలాకుతలమైంది. వాగులు, చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు చేరి ఉప్పొంగుతున్నాయి. రోడ్లపైకి వర్షపు నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సాధారణ జనజీవనం స్తంభించి పోయింది. శనివారం ఉదయం నుంచే వర్షం కురవడం మొదలైంది. రాత్రికి మరింత జోరందుకున్నది. తెల్లవారుజాము వరకు కురుస్తూనే ఉన్నది. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఒకటీ రెండు చోట్ల ఇల్లు కూలాయి. వేలేరుమండలంలో అత్యధికంగా వర్షం పడింది. వర్ష బీభత్సానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షంధాటికి కరెంట్ స్తంభాలు వంగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. నగరంలో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి.

12 గంటలూ.. వరదలోనే..

- వరంగల్ జిల్లా నెక్కొండలో వరదలో చిక్కుకున్న బస్సు
- బిక్కుబిక్కుమంటూ గడిపిన 46 మంది ప్రయాణికులు
- లారీ సాయంతో ఒడ్డుకు.. పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే

నెక్కొండ, సెప్టెంబరు 1: వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు వరదలో చిక్కుకోవడంతో 46 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 12గంటలు ఆ వరదలోనే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం గడిపారు. ప్రయాణికులు, స్థానికుల వివరాల ప్రకారం... మహబూబాబాద్ డిపోకు చెందిన టీఎస్24 జడ్0018 నెంబరు గల ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు వెళ్లింది. అక్కడి నుంచి బయలుదేరిన బస్సులో పలువురు ప్రయాణికులు మహబూబాబాద్‌కు బయలుదేరారు. మధ్యలో హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఒకరిద్దరు ప్రయాణికులు సైతం ఎక్కారు. శనివారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ సమీపంలో బస్సు వరదల్లో చిక్కుకుంది. చిమ్మచీకటితోపాటు భారీ వర్షం, ఉరుములు, మెరుపులకు ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ బస్సులో భయంభయంగా గడిపారు. విషయం తెలుసుకున్న నెక్కొండ ఎస్సై మహేందర్‌తో పోలీసు సిబ్బంది, వెంకటాపురం గ్రామ ప్రజలు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించారు. బస్సు దగ్గరకు వెళ్ల డానికి వరదలు అడ్డురావడంతో చేసేదిలేక అర కిలోమీటరు దూరం ఉండి ప్రయాణికులకు రాత్రంతా ధైర్యం చెప్పారు. బస్సు ప్రయాణికులను ఒడ్డుకు చేర్చడానికి పోలీసులు అర్ధరాత్రి వరకూ ప్రయత్నం చేసినా వర్షం పెరగడంతో వీలుకాలేదు.



ప్రయాణికులను రక్షించిన లారీ డ్రైవర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సత్యశారద

లారీ డ్రైవర్ సాయంతో ఒడ్డుకు..

వరదలో చిక్కుకున్న బస్సులో డ్రైవర్, కండక్టర్‌తోపాటు 25 మంది మహిళలు, 10 మంది పురుషులు, 11 మంది చిన్న పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం రైల్వే సిమెంట్ బ్రిక్స్ లోడ్‌తో నెక్కొండలో నిలిచిన సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన లారీ డ్రైవర్ రామును ఎస్సై మహేందర్ బస్సు ప్రయాణికులను రక్షించాలని కోరారు. దీంతో సాహసించిన డ్రైవర్ ఘటనా స్థలానికి చేరుకొని, బస్సు ఉన్న ప్రాంతానికి లారీని చాకచక్యంగా తీసుకువెళ్లి లారీలో ప్రయాణికులను ఎక్కించుకొని ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం బస్సు ఇంకా వరదలోనే ఉంది. అర కిలోమీటరు దూరంలో బస్సు ఉండడంతో కనీసం ఎవరికీ కనిపించని పరిస్థితి ఉంది.

కలెక్టర్, ఎమ్మెల్యే, సీపీ సహాయక చర్యలు



వరదలో చిక్కుకున్న బస్సులో బిక్కుబిక్కుమంటున్న ప్రయాణికులు

విషయం తెలుసుకున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదివారం ఉదయం వెంకటాపురం గ్రామం చేరుకున్నారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేసి ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి చేర్చారు. ప్రయాణికులకు వెంకటాపురం పాఠశాలలో అల్పాహారం, దుస్తులు అందించారు. అనంతరం నెక్కొండలోని సెయింట్ థెరిసా పాఠశాలలో భోజనం అందించి వారి ఇళ్లకు పంపించారు. ప్రయాణికులను రక్షించిన లారీ డ్రైవర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, నెక్కొండ సీఐ చంద్రమోహన్, నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం

- పొంగిపొర్లుతున్న వాగులు.. వంకలు
- వరద ముంపునకు గురైన రహదారులు, కల్వర్టులు
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- తెగిపోయిన చెరువులు, కుంటలు
- పలు గ్రామాల్లో పంట పొలాల్లోని వరద నీరు


మేడారం వంతెనల వద్ద జంపన్నవాగు ఉధృతి


తాడ్వాయి మండలంలోని మొండెలతోగు వద్ద దెబ్బతిన్న 163జాతీయ రహదారి


లక్నవరం చెరువులో ముంపుకు గురైన టూరిజం కాటేజీలు

తాడ్వాయి, సెప్టెంబరు 1 : భారీ వర్షాలకు పస్రా-తాడ్వాయి మార్గమధ్యలోని మొండ్యాలతోగు, జనగలంచ కల్వర్టులు వరద ముంపునకు గురై దెబ్బతిన్నాయి. దీంతో ఏటూరునాగారం, మంగపేట వైపు వెళ్లే పలు రకాల వాహనాలు నిలిచిపోయాయి. మొండ్యాలతోగు కల్వర్టు వద్ద పోలీసులు పహా రా కాస్తూ వాహనాలు నెమ్మదిగా వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం నుంచి సహకరిస్తున్నారు. ఏటూరునాగారం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను పస్రాలోనే నిలిపివేశారు. చిన్నచిన్న వాహనాలు, కార్లు, టాటాఏస్‌లు తాడ్వాయి మీదుగా మంగపేట వైపు వెళ్తున్నాయి. మండలంలోని తాడ్వాయి, ఇందిరానగర్, కాటాపూర్, బీరెల్లి, బందాల, లింగాల, రంగాపూర్, తదితర గ్రామాల్లో చిన్నచిన్న చెరువులు, కుంటలు తెగిపోయాయి. దీంతో పంట పొలాల్లో ఇసుకమేటలు వేయడంతో రైతులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. అంతేకాకుండా తాడ్వాయి, మేడారం, కొండపర్తి అడవుల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. చెట్ల కొమ్మలు విరిగిపోయి పోడు వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో పూరిళ్లు, గుడిసెలు నేలమట్టం అయ్యాయి. తాడ్వాయి మండల కేంద్రంతోపాటు లింగాల, బందాల, బీరెల్లి, రంగాపూర్, తదితర గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏజెన్సీలో ఉప్పొంగుతున్న వాగులు

ఏటూరునాగారం రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ అతలాకుతలమైంది. మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న జోరువానకు గ్రామాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. మండలంలోని వర్షాల కారణంగా జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దొడ్ల- మల్యాల మధ్యగల జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ తదితర గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అదేవిధంగా మండలంలోని బానాజీబంధం- ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్యగల జంపన్నవాగు ఉధృతికి ఎలిశెట్టిపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా రొయ్యూర్- చల్పాక గ్రామాల మధ్య నాగులమ్మ ఒర్రెకు వరద ఉధృతి పెరిగింది. ఆ రహదారిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో అల్లంవారిఘణపురం, చల్పాక, వీరాపురం, బానాజీబంధం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాయబంధంనకు వరద ఉధృతి కారణంగా ఆ గ్రామానికి రవాణా ఇబ్బందికరంగా మారింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరువానకు ఏజెన్సీ వాసులు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్తు సరాఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పునరావాస కేంద్రాలకు కొండాయి వాసులు

గతేడాది జంపన్నవాగు మహోగ్రరూపానికి బలైన కొండాయిపై అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రెండు రోజులుగా కుండబోతగా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అంతేకాకుండా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి జంపన్నవాగుకు వరద నీరు భారీగా చేరుతుండడంతో వాగు ఉగ్ర రూపం దాల్చింది. దీంతో విషాద సంఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ జగదీశ్వర్, సీఐ అనుమల శ్రీనివాస్ పడవ ద్వారా కొండాయి, మల్యాల గ్రామాల్లో పర్యటించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మల్యాల, కొండాయి గ్రామాల్లోని ప్రజలను గోవిందరాజు కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ సకల ఏర్పాట్లు చేశామని తెలిపారు. జంపన్నవాగు ఉధృతి తగ్గేంత వరకు తమ ఇళ్లకు వెళ్లొద్దని వారికి సూచించారు.

భూటారం గ్రామానికి వరద ముప్పు

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో ఆయా ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో వరదనీరు మండలంలోని జంపన్నవాగులో కలుస్తోంది. దీంతో భూటారం గ్రామానికి వరద పెరుగుతోంది. దీంతో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ అప్రమత్తమయ్యారు. భూటారం ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు వెంటనే ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఎంపీవో కుమార్, ఎస్సై ఎస్‌కె. తాజుద్దీన్, మండల స్పెషల్ ఆఫీసర్ సీతాపతితో పాటు ఆయా శాఖ అధికారులు, సిబ్బందితో భూటారం చేరుకున్నారు. గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భూటారం గ్రామంలో నివాసం ఉంటున్న 70 కుటుంబాల్లోని సుమారు 230 మందిని వివిధ ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసి ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వారిని ఆదివారం మధ్యాహ్నం తరలించారు. బాధ్యత కుటుంబాలకు భోజనం, మంచి నీటి సౌకర్యం, నిత్యావసర వస్తువులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆయా శాఖల అధికారులు ఇందుకు నిమగ్నమయ్యారు. వరద బాధితులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు ప్రజలు అధైర్య పడొద్దని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు వెంటే ఉంటారని, 48 గంటలు అప్రమత్తంగా సహాయక చర్యలు చేపడగారని పేర్కొన్నారు


జనగలంచ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

నిలిచిన ఆర్టీసీ బస్సులు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏటూరు నాగారం-హనుమకొండ 163వ జాతీయ రహదారి తాడ్వాయి-పస్రా మార్గంలో శనివారం రాత్రి రహదారి తెగిపోయింది. దీంతో శనివారం రాత్రి ఏటూరునాగారం బస్టాండు మీదుగా వెళ్లాల్సిన సుమారు 25 ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. హనుమకొండ నుంచి వయా ఏటూరు నాగారం మీదుగా భద్రాచలం, మణుగూరు, రాజమండ్రి, గుంటూరు, కొత్తగూడెంతో పాటు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు సైతం బస్టాండ్‌లో నిలిచిపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు, ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

30 అడుగులకు చేరిన రామప్ప చెరువు

వెంకటాపూర్(రామప్ప) : భారీ వర్షానికి వరదనీరు రామప్ప సరస్సులోకి చేరుతోంది. రామప్ప జలాశయానికి ఆదివారం సాయంత్రం 6గంటలకు 30' అడుగుల నీటిమట్టం నమోదైందని ఐబీ అధికారులు తెలిపారు. 35ఫీట్ల నీటి సామర్థ్యం కలిగిన రామప్ప సరస్సు ఇంకో రెండురోజులు ఎడతెరిపిలేకుండా వానలు కురిస్తే మత్తడిపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నీటమునిగిన అంతర్గత రోడ్లు

వాజేడు : ఏకదాటిగా కురిసిన వర్షానికి పలు అంతముంచెత్తిన వానకు అంతర్గత రోడ్లు నీట మునిగాయి. చెరువులు, కుంటలకు వరద నీరు చేరాయి. ఇంకా వర్షాలు కురిసే ఆస్కారం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రలకు తరలించే ఏర్పాట్లను చేశారు. మండలంలో గోదావరి స్వల్పంగా పెరుగుతోంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కాటారం : మండలంలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు దఫాలుగా కురిసిన వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షంతో గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ ఎర్ర వాగు, మల్లారం అలుగు వాగులు భారీవర్షానికి పొంగిపొర్లాయి. దీంతో పలు గ్రామాలకు కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం శివారులో 33కేవీ విద్యుత్ లైన్ తెగి 11కేవీ విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా కొన్ని గంటలపాటు నిలిచిపోగా వానలోనూ విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. వాగులు ఉధృతంగా లోలెవల్ కాజ్‌వేలపై నుంచి ప్రవహిస్తుండటంతో ఎవరూ దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీ వర్షం దాటికి గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలన్నీ వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. గూడూరు వద్ద ఇప్పమాటు ఉప్పొంగి వరి పొలాలు నీటమునిగాయి. పెద్దవాగు ఉప్పొంగడంతో దామెరకుంట, మల్లారం, గంగపురి, గుంద్రాత్ పల్లి పరిధిలో పత్తి చేలల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉధృతంగా మోరంచవాగు

గణపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మోరంచ వాగు ఉప్పొంగింది. మండల కేంద్రం నుంచి అప్పయ్యపల్లి గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న మోరంచవాగు ప్రవాహం పెరగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొండంపల్లి, రంగారావుపల్లి, అప్పయ్యపల్లి, గుర్రంపేట గ్రామాలకు వెళ్లే ప్రజలు నగరంపల్లి మీదుగా వెళ్తున్నారు. మోరంచవాగు శివారులోని పంట పొలాలు వరద దాటికి నీట మునిగాయి. అంతేకాకుండా మండల కేంద్రలోని గణపసముద్రం నీటిమట్టం 27 ఫీట్లకు చేరుకుంది.

పోటెత్తిన మానేరు.. ఆరెవాగు

మల్హర్ : మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ఎగువన కురిసిన వర్షాల వల్ల తాడిచర్ల, పీవీనగర్ వద్ద మానేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం మానేరులో మీటరున్నర ఎత్తులో ప్రవాహం సాగుతోంది. మల్లారం ఆరెవాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం వల్ల పత్తి, వరి చేలల్లోకి వరద నీరు వచ్చి చేరింది. వర్షాల వల్ల మానేరు, వాగుల పరిసర ప్రాంతాల వైపు ఎవరూ వెళ్లొద్దని గామస్థులను అధికారులు హెచ్చరిస్తున్నారు.

భూపాలపల్లిలో 27.9 మి.మీటర్ల వర్షపాతం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వర్షం పడింది. ఎ. జిల్లా వ్యాప్తంగా 27.9 మిల్లీమీటర్ల వర్షం పడి నట్లు అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అత్యధికంగా రేగొండ మండలంలో 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మహదేవపూర్‌లో 2.0 మిల్లీ మీటర్లు కురిసింది. అలాగే, పలిమెలలో 9.8, మహముత్తారంలో 12.4, కాటారంలో 2.4, మల్హర్‌రావులో 33.2, చిట్యాలలో 41.2, టేకుమట్లలో 54.8, మొగుళ్లపల్లిలో 43.4, గణపురంలో 26.2, భూపాలపల్లిలో 23.8 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు అధికారులు స్పష్టం చేశారు.

నిలిచిపోయిన రాకపోకలు

మహాముత్తారం : మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కాటారం- మేడారం రోడ్డులో కేశాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో మేడారం వైపు రాకపోకలు నిలిచిపోయి. మహాముత్తారం సబ్‌స్టేషన్ వద్ద కోనంపేటవాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల కేంద్రానికి రాకపోకలు స్తంభించాయి. మహాముత్తారం సబ్‌స్టేషన్ వాగు వద్ద 108 వాహనం మండలంలోని ప్రేమ్‌నగర్‌కు అత్యవసర సేవలు అందించడానికి వెళ్తూ వాగు దాటలేక నిలిచిపోయింది.

ఏజెన్సీలో కుండపోత

ములుగు, సెప్టెంబరు 1: శని, ఆదివారాలకు గానూ వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఊహించినట్టుగానే మూడు ఏజెన్సీ మండలాల్లో ఆకాశానికి చిల్లులు పడ్డట్లుగా కుండపోత కురిసింది. జిల్లాలో 113.5మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాడ్వాయి మండలంలో 260.8మి.మీ, ఏటూరునాగారంలో 235.4మి.మీ, గోవిందరావుపేటలో 151.8మి.మీ, మంగపేటలో 73.4మి.మీ, ములుగులో 70మి.మీ, వెంకటాపురం(నూగూరు)లో 69.2మి.మీ, వెంకటాపూర్(రామప్ప)లో 66.6మి.మీ, వాజేడులో 58.6మి.మీ, కన్నాయిగూడెం మండలంలో 35.మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు వాజేడులో 83.3మి.మీ, గోవిందరావుపేటలో 80.8మి.మీ, ఏటూరునాగారంలో 48.5మి.మీ, మంగపేటలో 35.5మి.మీ, వెంకటాపురం(నూగూరు)లో 26.8మి.మీ, వెంకటాపూర్(రామప్ప)లో 24.5మి.మీ, ములుగులో 22మి.మీ వర్షం కురిసింది.

లక్నవరం చెరువకు మత్తడి

లక్నవరం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరి మత్తడి పోస్తోంది. నీళ్ల ఉయ్యాల వంతెనను తాకగా ఐలాండ్‌లలోని టూరిజం కాటేజీలు ముంపునకు గురయ్యాయి.

పొంగిపొర్లుతున్న వాగులు

వెంకటాపురం(నూగూరు): మండలంలో గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా వాగుల్లోకి చేరి ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. దీంతో కలిపాక, ముత్తారం, పెంకవాగు, కర్రవానిగుంపు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని జిన్నెలవాగు, కంకలవాగు, రాచపల్లివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాగా, మండలకేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్‌పోల్ విరిగి రోడ్డుమీద పడడంతో విద్యుత్‌లైన్‌లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

మేడారం : తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగు శనివారం కురిసి వర్షానికి వరద నీటితో ఆదివారం ఉధృతంగా ప్రవహించింది. చింతల్ క్రాస్ వద్ద లోలెవల్ వంతెన నీట మునింగింది. అధికారులు, పోలీసులు ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులు, కాల్వలు, ఒర్రెలు వరద నీటితో ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటొద్దని సూచించారు. ఎప్పటికప్పుడు జంపన్నవాగు వరద ఉధృతి అంచానాలు వేస్తూ ప్రభుత్వానికి సమాచారం తెలియజేస్తున్నమని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జంపన్నవాగు వరద ముంపు ప్రాంతాల్లో మేడారం జంటవంతెనలు, చింతల్ క్రాస్, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం కాజ్‌వే, శివరాంసాగర్ మత్తడి, వెంగళాపూర్ శివారు బాంబుల ఒర్రె వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ఎవరు చాపల వేటకు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నారు. మేడారంలో పంచాయితీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ లతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా జంపన్నవాగు వరద ఉధతిని పరిశీలించారు. వర్షాలు తగ్గేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

వనదేవతల దర్శనానికి రెండు రోజుల సెలవు

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మ దర్శనాలను వర్షాల కారణంగా రెండు రోజులు వాయిదా వేశారు. ఈ మేరకు ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు.



వాహనదారులను కాపాడిన గ్రామస్థులు

చిట్యాల, సెప్టెంబరు 1: మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి, మిర్చి, వరి పంటలు నీటమునిగాయి. తహసీల్దార్ హేమ, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ బాస్కర్ల రాజు సిబ్బందితో కలిసి లోతట్టు ప్రాంతాలను సందర్శిం చారు. వర్ష ప్రభావంతో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తు, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గిద్దెముత్తారం- తండా మధ్య కల్వర్టుపై ద్వి చక్ర వాహనం అదుపుతప్పడంతో వాహనంపై ప్రయాణిస్తున్న టేకుమట్ల రామకృష్ణాపురానికి చెందిన కొండా రాజయ్య, మైన మొగిలి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా గ్రామస్థులు కాపాడారు.

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ అన్నారు. మండలంలోని మోరంచవాగు పరీవాహక గ్రామాలను ఆయన సందర్శించారు. మోరంచ ఉధృతిని పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదన్నారు. రైతులు పంట పొలాల వద్దకు వెళ్లిన సమయంలో విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువకులు నీటిప్రవాహం ఉన్న చోట సెల్ఫీలు తీసుకోకూడదని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తప్పనిసరిగా సెలవు పాటించాలని పేర్కొన్నారు..

● ములుగు కలెక్టరేట్: జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్.దివాకర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దివాకర తెలిపారు. భారీ వర్షాల కారణంగా జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యిందని అన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1: జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కలెక్టరేట్ నుంచి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్ధం చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రసవ తేదీ సమీపిస్తున్న గర్భిణులను ఆస్పత్రులకు తరలించాలన్నారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అలర్ట్‌గా ఉండాలి

మహదేవపూర్, సెప్టెంబరు 1 :భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని, ఎవరూ బయటకు రావొద్దని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి సూచించారు. ఎవరూ కూడా బయటకు రాకూడదని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండొద్దని అన్నారు. గోదావరి తీర ప్రాంతాలకు వెళ్లకూడదన్నారు మత్స్యకా రులు చేపలు పట్టేందుకు గోదావరి, చెరువువులు, వాగుల వద్దకు వెళ్లొద్దన్నారు.

తగ్గిన బొగ్గు రవాణా

గణపురం, సెప్టెంబరు 1: కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు బొగ్గు రవాణా తగ్గింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొగ్గు గనుల్లో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడటంతో కేటీపీపీకి బొగ్గు సరఫరా తగ్గిందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. నిత్యం తాడిచర్ల, భూపాలపల్లి బొగ్గు గనులనుంచి 12 వేల టన్నుల బొగ్గు జెన్కోకు చేరుతుంది. వర్షాల కారణంగా రెండు రోజుల్లో 3వేల టన్నుల బొగ్గు మాత్రమే కేటీపీపీకి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం కేటీపీపీ కోల్ యార్డ్‌లో 3లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, సుమారు 25 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తికి సరిపోతాయని అన్నారు.

వెలమలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ఘనంగా వెలమ సంక్షేమ సంఘం వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెలమలు సంఘటితంగా అన్ని రంగాల్లో మరింత రాణించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ పెద్దమ్మగడ్డలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ సంక్షేమ సంఘం 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూదన్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. వెలమలు రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో రాణించాలన్నారు. వెలమ సంక్షేమ సంఘం సామాజిక కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. నిరుపేద వెలమ కుటుంబాలకు అండగా ఉండాలని, పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత నివ్వాలని కోరారు. వెలమల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు.

కాగా, వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాకులమర్రి మప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు సంఘం వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. సంఘం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంఘం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వెల్లడించారు. సంఘం ఉపాధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి రవీందర్ రావు, సభ్యులు గండ్ర ప్రవీణ్, విద్యాసాగర్ రావు, అశోక్ రావు, బాలకిషన్ రావు, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. 68 మంది పేద వెలమ విద్యార్థులకు రూ.5లక్షల మేరకు స్కాలర్‌షిప్పులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సమావేశానికి సుమారు 500 మంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

● ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల, వాగుల పరిసర ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం వారు ఖమ్మం నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే 48గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తమై అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీరాజ్ అధికారులు గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చెరువులు, వివిధ ప్రాజెక్టుల కాల్వలు, నీటినిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూం నంబర్లు 18004257109, 6309842395, 08717-293246లపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లోని లోతట్టు వంతెనల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి ప్రవాహం ఎక్కువైతే బారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి, జంతు నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 1: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పులి శ్రీనివాస్ (46)కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలోంచి మేల్కొనే చూసి సరికి ఉరేసుకొని ఉన్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.